సాక్షి అన్నమయ్య జిల్లా

శనివారం । 28 । అక్టోబర్ । 2023



జిల్లా నెట్‌బాల్ జట్ల ఎంపిక

రామనపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఎస్‌జీఎఫ్ జిల్లా స్థాయి నెట్‌బాల్ జట్లను శుక్రవారం ఎన్నుకున్నారు.

-8లో



ఆనందసాగరంలో అన్నదాత

రైతుల సాగునీటి కల సాకారం చేసేందుకు రూ.110 కోట్లతో చేపట్టిన సర్వరాయసాగర్ ప్రాజెక్టు పెండింగ్ పనులను వేగవంతం చేశారు.

-8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)



	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.250	రూ.320
రెండోరకం	రూ.150	రూ.248

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 362 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)



రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	380	380
సీబీ	-	-

మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 34.320 కిలోలు

న్యూస్‌రీల్

బాధ్యతల స్వీకరణ

రాయచోటి: అన్నమయ్య జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో డిప్యూటీ కలెక్టర్‌గా శ్రీలేఖ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. రీ సర్వే, ఎలక్షన్స్, ఆర్‌ఓఆర్ వెబ్ ల్యాండ్ కరెక్షన్స్, లీగల్ సెల్, జగనన్నకి చెబుదాం విభాగాలను ఈమె పర్యవేక్షిస్తారు.

జాతీయ స్క్వాయ్ రిఫరీగా ఫహీం



షేక్ ఫహీంబాషా

మదనపల్లె: నవంబర్ 6 నుంచి 8 వరకు గోవాలో జరిగే నేషనల్ స్క్వాయ్ మార్షల్‌ఆర్ట్స్ పోటీలకు మన రాష్ట్రం తరపున ఏ గ్రేడ్ రెఫరీగా మదనపల్లెకు చెందిన షేక్ ఫహీం బాషా ఎంపికయ్యారు. ఈ విషయాన్ని స్క్వాయ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా సెక్రటరీ జనరల్ అర్షిద్ అహ్మద్‌భట్ శుక్రవారం ధృవీకరించారు. కాగా, ఫహీంబాషాను రాష్ట్ర స్క్వాయ్ చైర్మన్ కరీ ముల్లా, సెక్రటరీ ఇబ్రహీంలు అభినందించారు.

పలు రైళ్లు రద్దు

కడప కోటిరెడ్డిసర్కిల్: జిల్లా మీదుగా వివిధ ప్రాంతాలకు నడుస్తున్న పలు రైళ్లను తాత్కాలికంగా రద్దు చేశారని కడప రైల్వే కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ జనార్దన్ తెలిపారు. ధర్మవరం–మచిలీపట్నం (17216) మధ్య నడిచే రైలు నవంబరు 3వ తేదీ వరకు, మచిలీపట్నం–ధర్మవరం (17215) మధ్య నడిచే రైలు నవంబరు 2వ తేదీ వరకు రద్దు చేశారన్నారు. ఈ రైళ్లు పై తేదీలలో నంద్యాల, డోన్, గుత్తి మీదుగా వెళతాయన్నారు. మధురై–ఓఖా (09519) మధ్య నడుస్తున్న రైలు నవంబరు 3వ తేదీన కాట్పాడి, పాకాల, ధర్మవరం, గుత్తి మీదుగా ఓఖాకు వెళుతుందన్నారు. అరక్కోణం ప్యాసింజర్‌ను ఈనెల 30వ తేదీ నుంచి నవంబరు 5వ తేదీ వరకు రద్దుచేశారని ఆయన వివరించారు.

డిసెంబర్ లోపు సిలబస్ పూర్తి




రికార్డులను పరిశీలిస్తున్న కృష్ణయ్య

రాజంపేట టౌన్: ఇంటర్ విద్యార్థులకు డిసెంబర్ లోపు సిలబస్ పూర్తి చేయాలని ఇంటర్మీడియట్ విద్య జిల్లా అధికారి కృష్ణయ్య తెలిపారు. స్థానిక ఉర్దూ జూనియర్ కళాశాలను ఆయన శుక్రవారం తనిఖీ చేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ వచ్చే ఏడాది జరగనున్న ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల్లో అత్యుత్తమ ఫలితాల సాధనకు ఆయా కళాశాలల ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు సమష్టిగా కృషి చేయాలన్నారు. విద్యార్థుల విద్య ప్రగతి గురించి అధ్యాపకులను అడిగి తెలుసుకొని పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ప్రతి రోజు ఉదయం 9 గంటల నుంచి 9–30 గంటల వరకు, సాయంత్రం 4 గంటల నుంచి 5 గంటల వరకు విధిగా విద్యార్థులకు స్టడీ అవర్ నిర్వహించాలని తెలిపారు.

పర్యావరణాన్ని రక్షించండి

రాయచోటి అర్బన్: పర్యావరణాన్ని రక్షించాలని, ఇది అందరి బాధ్యత అని డీఈఓ శ్రీరామ్ పురుషోత్తం అన్నారు. శుక్రవారం సాయంత్రం తన కార్యాలయంలో ఆయన 'గ్రీన్‌స్కూల్' కార్యక్రమ కరపత్రాలు, బ్యానర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతిపాఠశాలలోనూ గాలి, నీరు, నేల, శక్తి, వ్యర్థపదార్థాల నిర్వహణ, జీవ వైవిధ్యం అనే ఆరు అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. వీటిని గ్రీన్‌స్కూల్ ప్రోగ్రాం వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలన్నారు. ఫిబ్రవరి నెలలో అందజేసే జాతీయ స్థాయి అవార్డులకు ఎక్కువ స్కూళ్లు పోటీపడాలన్నారు. కార్యక్రమంలో గతంలో జాతీయ గ్రీన్‌స్కూల్ అవార్డును అందుకున్న సంబేపల్లె జడ్పీహైస్కూల్ హెచ్‌ఎం ఎం.నరసింహారెడ్డి, జిల్లా ఎస్‌జీసీ కో–ఆర్డినేటర్ రవీంద్రారెడ్డి, జిల్లా సైన్స్‌అధికారి మార్ల ఓబులరెడ్డి పాల్గొన్నారు.

చెకుముకి సైన్స్ సంబరాలు



చెకుముకి సైన్స్ సంబరాలు గోడపత్రాలను ఆవిష్కరిస్తున్న డీఈఓ, తదితరులు

రాయచోటి అర్బన్: నవంబరు 10వ తేదీ నుంచి చెకుముకి సైన్స్ సంబరాలు నిర్వహిస్తున్నట్లు అన్నమయ్య జిల్లా విద్యాధికారి శ్రీరామ్ పురుషోత్తం తెలిపారు. తన కార్యాలయంలో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించే చెకుముకి పరీక్ష గోడపత్రాలను శుక్రవారం ఆయన ఆవిష్కరించారు. ఆయన సంబరాల్లో పాల్గొనేలా విద్యార్థులను ప్రోత్సహించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. పాఠశాలల ప్రధానోపాధ్యాయులు 8, 9, 10వ తరగతుల విద్యార్థులకు చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్టు నిర్వహించి వారిలో శాస్త్రీయ ఆలోచనా దృక్పథాన్ని పెంపొందించాలంటూ కోరారు. జేవీవీ ప్రతినిధి ఆంజనేయులు, మార్ల ఓబులరెడ్డి, శ్రీనివాసరాజు, శివప్రకాష్ రెడ్డి, కరుణాకర్, బాబాఫక్రుద్దీన్ పాల్గొన్నారు.

పేదల గుండెలపై సంక్షేమ సంతకం!

'మీ కుటుంబానికి ఈ ప్రభుత్వం వల్ల మేలు జరిగిందీ అంటే మళ్లీ మాకు ఓటెయ్యండి' – ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చెప్పిన మాట ఇది. 'మేము మేలు చేశాం అది చెప్పడానికే మీ ముందుకు వస్తున్నాం' అంటూ ఇపుడు ఉమ్మడి జిల్లాలో సామాజిక సాధికార యాత్ర ద్వారా పలువురు మంత్రులు, నాయకులు పర్యటించనున్నారు. ఈ నెల 28వ తేదీ(శనివారం) సామాజిక సాధికార బస్సు యాత్ర ప్రొద్దుటూరులో ప్రారంభమవుతుంది. దీంతో అధికార వైఎస్సార్ సీపీ శ్రేణుల్లో నూతనోత్తేజం కలుగుతోంది.

- బడుగు, బలహీన వర్గాల ఉన్నతికి విశేష కృషి
- ప్రతి పేదవాడి తలుపు తట్టిన సంక్షేమ పథకాలు
- ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలో లభించిన సామాజిక సాధికారత
- ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు సమున్నత గౌరవం
- సామాజిక రాజకీయ ఉన్నతికి ప్రాధాన్యత ఇచ్చిన వైఎస్.జగన్ సర్కార్
- నేడు ప్రొద్దుటూరులో సామాజిక సాధికారత యాత్ర



సాక్షి ప్రతినిధి, కడప: రాజకీయ పార్టీల్లో బడుగు, బలహీన, మైనార్టీ వర్గాలు పల్లకీ మోసే బోయీలుగా మిగిలిపోయేవారు. ప్రభుత్వ పాలన, సంక్షేమ పథకాల్లో అరకొర భాగస్వామ్యం ఉండేది. అది గతంలో ఉన్న పరిస్థితి. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సర్కార్ చరిత్రను తిరగరాసింది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు సమున్నత గౌరవమిచ్చింది. పేదలకు ఆర్థిక చేయూత నిచ్చేందుకు తొలి రోజు నుంచి అడుగులు పడుతున్నాయి. సిఫార్సులతో నిమిత్తం లేకుండా అర్హత ప్రామాణికంగా పేదల గడపకు సంక్షేమం పరుగులు తీస్తోంది. సామాజిక న్యాయం పాటిస్తూ, రాజకీయ ఉన్నతికి సైతం తోడ్పాటు అందించిన ఏకైక సర్కార్ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమేనని విశ్లేషకులు స్పష్టం చేస్తున్నారు.

- గతంలో రాజ్యాధికారం, సామాజిక న్యాయం మాటలు చెప్పుకొనేందుకు మాత్రమే. వర్తమానంలో సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సర్కార్ ఆచరణలో చూపెట్టింది. పేరున్న కమ్యూనిస్టు నేతలు సైతం సామాజిక న్యాయం అమలు చేస్తున్న తీరును చూసి ఔరా అన్పించేలా ప్రభుత్వ చర్యలు ఉండిపోయాయి. ప్రభుత్వం చేసిన మేలు చెప్పుకొనేందుకు సమాజంలో అణగారిన వర్గాలకు లభించిన గౌరవ మర్యాదలను వివరించేందుకు వైఎస్సార్‌సీపీ శ్రీకారం చుట్టింది. శనివారం ప్రొద్దుటూరులో సామాజిక సాధికార యాత్ర చేపట్టనున్నారు.

ఆత్మగౌరవం కోసం....

రాబోవు ఎన్నికల్లో పెత్తందారులకు, పేదలకు మధ్య నెలకొన్న పోటీని వివరించేందుకు వైఎస్సార్‌సీపీ నేతలు సర్వసన్నద్ధులయ్యారు. ఓటు బ్యాంకు రాజకీయాలకే పరిమితం చేసిన తెలుగుదేశం పార్టీ ఓ వైపు, సామాజిక స్థాయి, ఆర్థిక ఉన్నతి, ఆత్మ గౌరవం పెంచిన వైఎస్సార్‌సీపీ మరోవైపు ఉన్న నేపథ్యంలో ఆత్మ గౌరవం నిలుపుకొనేందుకు బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలకు చెందిన నాయకులు ముందడుగు వేశారు.

అందులో భాగంగా చేపట్టిన సామాజిక సాధికారత యాత్ర శనివారం అన్నమయ్య జిల్లా ప్రొద్దుటూరులో ప్రారంభమవుతుంది. ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున వెనుకబడిన వర్గాలకు చెందిన ప్రజానీకం తరలివచ్చి, విజయవంతం చేసేందుకు సంసిద్ధులయ్యారు.

సంక్షేమంలో అగ్రస్థానం...

జిల్లాలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు సంక్షేమ పథకాల్లో అగ్రస్థానం లభించింది. జగనన్న అమ్మ ఒడి, వసతి దీవెన, విద్యా దీవెన, వైఎస్సార్ రైతు భరోసా, సున్నా వడ్డీ, ఉచిత పంటల బీమా, పింఛన్ కానుక, చేయూత, ఆసరా, బీమా, నేతన్న నేస్తం, జగనన్న చేదోడు, వైఎస్సార్ ఆరోగ్యశ్రీ, కళ్యాణమస్తు, షాదీతోఫా, జగనన్న తోడు తదితర పథకాల ద్వారా జిల్లాలోని 19,54,575 మంది లబ్ధిదారులకు రూ.12,061 కోట్ల లబ్ధి చేకూరింది. అందులో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలకు చెందిన 12,86,500 మందికి రూ.7,984.48 కోట్లు లభించింది. వైఎస్సార్‌సీపీ మినహా మునుపెన్నడూ ఇలాంటి సంక్షేమం అందించిన చరిత్ర మరెవ్వరికీ లేదన్నది నగ్నసత్యం.

బస్సు యాత్ర షెడ్యూల్ ఇలా..


ప్రొద్దుటూరులో శనివారం జరగనున్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సామాజిక సాధికార బస్సు యాత్ర పర్యటన వివరాలను నాయకులు శుక్రవారం వెల్లడించారు. యాత్ర షెడ్యూల్ వివరాలు ఇలా ఉన్నాయి.

- మధ్యాహ్నం 12 గంటలకు ప్రముఖులంతా రామేశ్వరం బైపాస్ రోడ్డులోని వైవీఆర్ ఫంక్షన్ హాల్‌కు చేరుకుంటారు.
- మధ్యాహ్నం 12 నుంచి 1 గంట వరకు ఫంక్షన్ హాల్‌లో తటస్థులతో సమావేశం నిర్వహిస్తారు.
- మధ్యాహ్నం 1 నుంచి 1.30 గంటలకు ప్రెస్ కాన్ఫరెన్స్, 1.30 గంటల నుంచి 2.30 గంటల వరకు తటస్థులు, మేధావులతో కలిసి భోజనం చేస్తారు.
- 2.45 గంటలకు రామేశ్వరం నాలుగు రోడ్ల కూడలి నుంచి సామాజిక సాధికార బస్సు యాత్ర ప్రారంభం కానుంది.
- 3.20 గంటలకు బైక్‌లు, ట్రాక్టర్లతో బస్సు యాత్ర వెంబడి ర్యాలీ నిర్వహించనున్నారు.
- 3.55 గంటలకు వన్‌టౌన్ సర్కిల్‌లో ఉప ముఖ్యమంత్రి అంజద్ బాషా, కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్ ముస్లిం మైనార్టీలనుద్దేశించి ప్రసంగించనున్నారు.
- 4.20 గంటలకు విజయకుమార్ సర్కిల్ వద్ద ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డితోపాటు నాయకులు విద్యార్థులతో మాట్లాడనున్నారు.
- పుట్టపర్తి సెంటర్‌లో సాయంత్రం 6.45 గంటలకు బహిరంగ సభ ముగియనుంది.

నాడు పెత్తందారులకు చుట్టం

తెలుగుదేశం పార్టీ 'చెట్టు పేరు చెప్పి కాయలు అమ్ముకున్నట్లు'గా బీసీల పట్ల యూజ్ అండ్ త్రో పాలసీ పెట్టుకుంది. ఓటు బ్యాంకు రాజకీయాలకు ప్రాధాన్యం ఇచ్చింది. రాజకీయంగా వాడుకోవడం మినహా పాలనలో, సంక్షేమంలో సముచిత స్థానం కల్పించడంలో విఫలమైంది. ఆదరణ పేరుతో వృత్తి పనిముట్లు ఇవ్వడం మినహా సామాజిక అభివృద్ధికి చేయూత ఇచ్చిన దాఖలాల్లేవు. కార్పొరేషన్ పదవుల పంపకం లోనూ నామమాత్రపు చర్యలు చేపట్టింది. స్థానిక సంస్థల్లో పోటీకి సైతం వెనుకబడిన వర్గాల పట్ల చిన్న చూపు చూసేవారు. రిజర్వేషన్ల స్థాయిని మించి బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు పదవులు అప్పగించిన చరిత్ర వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానిదే. ఓసీ జడ్పీటీసీ లభించిన చోట, బీసీలకు మండలాధ్యక్ష పదవి ఇచ్చిన ఘనత ఆ పార్టీదేనని పరిశీలకులు వెల్లడిస్తున్నారు.

నేడు పేదలకు పట్టం...



ఆదరించిన ప్రజలకు అండగా నిలిచేందుకు సీఎం వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి విశేషంగా శ్రమించారు. నాలుగున్నరేళ్ల పాలనలో సామాజిక విప్లవాన్ని తీసుకువచ్చారు. జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల సంక్షేమానికి వివిధ ప్రభుత్వ పథకాల ద్వారా రూ.7,984.48 కోట్లు అందించారు. అందులో ఎస్సీలకు రూ.2,000.92కోట్లు, ఎస్టీలకు రూ.212.47 కోట్లు, బీసీలకు రూ.5,263.09 కోట్లు, మైనార్టీలకు రూ.508 కోట్లు దక్కాయి. ఇంత పెద్ద ఎత్తున జిల్లాలో బడుగు, బలహీన, మైనార్టీ వర్గాలకు సంక్షేమం లభించిన చరిత్ర, కనీవినీ ఎరుగని పరిస్థితి ఈ ప్రభుత్వంలోనే ఉందని పలువురు వివరిస్తున్నారు.

సమున్నత గౌరవం



అంజద్‌బాషా జకియా ఖానమ్ రమేష్ యాదవ్

ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలో బడుగు, బలహీన వర్గాలకు సమున్నత గౌరవం దక్కింది. డిప్యూటీ సీఎం హోదా కడప ఎమ్మెల్యే ఎస్‌బి అంజద్‌బాషాకు దక్కింది. మరో ముస్లిం మైనార్టీ నేత జకియా ఖానమ్‌కు ఎమ్మెల్సీ ఇస్తూనే శాసన మండలి డిప్యూటీ చైర్మన్ హోదా కల్పించారు. ప్రొద్దుటూరుకు చెందిన రమేష్ యాదవ్‌కు ఎమ్మెల్సీ లభించింది. స్థానిక సంస్థల నుంచి రాష్ట్ర స్థాయి పదవుల వరకూ 372 మంది వివిధ హోదాల్లో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలకు చెందిన వారే జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నారు.

నామినేటెడ్ పదవుల్లోనూ..

రాష్ట్ర స్థాయి కార్పొరేషన్ పదవులు.. పది మందికి దక్కాయి. యాదవ కార్పొరేషన్ చైర్మన్ ఎన్.హరీష్ యాదవ్, పద్మశాలీ కార్పొరేషన్ చైర్ పర్సన్‌గా జింకా విజయలక్ష్మి, నూర్‌బాషా కార్పొరేషన్ చైర్ పర్సన్‌గా ఫక్రుబీ, సగర కార్పొరేషన్ చైర్ పర్సన్‌గా రమణమ్మ, హజ్ కమిటీ చైర్మన్‌గా గౌస్ లాజం, వేర్‌హౌస్ కార్పొరేషన్ చైర్మన్‌గా కరీముల్లా, ఏపీపీఎస్సీ సభ్యుడిగా సలాంబాబు, టీటీడీ సభ్యుడిగా యానాదయ్య, అర్బన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్ పర్సన్‌గా లీలావతి, హస్తకళల సంస్థ చైర్ పర్సన్‌గా బి.విజయలక్ష్మి, సోషల్ వెల్ఫేర్ బోర్డు చైర్మన్‌గా పులి సునీల్‌కుమార్‌లకు అవకాశం కల్పించారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్లుగా బి గంగాదేవి (కడప), పి.లక్ష్మీదేవి(బద్వేల్), మంగళ ఉమాదేవి(యర్రగుంట్ల), జి.చిన్నప్ప (పులివెందుల), లక్ష్మీదేవి (సిద్దవటం)లకు అప్పగించారు. మరో 54 మంది కార్పొరేషన్ల డైరెక్టర్లుగా కొనసాగుతున్నారు.

మైనార్టీలపై మక్కువ



దివంగత వైఎస్.రాజశేఖర రెడ్డి ముస్లిం మైనార్టీలకు 4 శాతం రిజర్వేషన్ కల్పించి వారి హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారు. తండ్రి కంటే మిన్నగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముస్లింలకు ఐదు శాతం రిజర్వేషన్లు కల్పించారు. ఉప ముఖ్యమంత్రి, శాసన మండలి డిప్యూటీ చైర్మన్, ఎమ్మెల్సీ, నామినేటెడ్ పదవుల్లో ప్రాధాన్యం కల్పించారు.

– అఫ్జల్‌ఖాన్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి

సేవలకులను పాలకులుగా మార్చారు



టీటీడీ, ఇతర దేవాలయాల్లో క్షౌరవత్తి, వాయిద్యకారులుగా ఏళ్లుగా సేవలందించారు. టీటీడీ పదవులకు దేశవ్యాప్తంగా డిమాండ్ ఉంది. కోట్లు వెచ్చించి కొనేవారు కోకోల్లలు ఉన్నారు. కానీ నాయీ బ్రాహ్మణుడిని నియమించి సీఎం సాహసోపేత నిర్ణయం తీసుకున్నారు.

– యానాదయ్య, టీటీడీ బోర్డు సభ్యుడు

రాజ్యాధికారంలో భాగస్వామ్యం



వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయ్యాక ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు రాజ్యాధికారంలో భాగస్వామ్యం కల్పించారు. దళితులకు పదవుల్లో అధిక ప్రాధాన్యం కల్పించారు. నా ఎస్సీ, నా ఎస్టీ, నా బీసీ, నా మైనార్టీ అంటూ చేయి పట్టుకొని రాజ్యాధికారం వైపు నడిపిస్తున్నారు.

– పులి సునీల్ కుమార్, ఏపీ సోషల్ వెల్ఫేర్ బోర్డు చైర్మన్

నేడు ప్రొద్దుటూరులో సామాజిక సాధికార యాత్ర



బస్సు యాత్ర ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి, ఎమ్మెల్సీ తలశిల రఘురాం

ప్రొద్దుటూరు: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నిర్వహించతలపెట్టిన సామాజిక సాధికార యాత్ర జిల్లాలో తొలిమారుగా శనివారం ప్రొద్దుటూరులో ప్రారంభించనున్నారు. సాయంత్రం 4.30 గంటలకు పుట్టపర్తి సెంటర్‌లో వేలాది మందితో సభ నిర్వహించేందుకు ఏర్పాట్లుచేశారు. ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి ఆధ్వర్యంలో జరగనున్న సభకు ఉప ముఖ్యమంత్రి అంజద్ బాషా, జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి, మాజీ మంత్రి అనిల్ కుమార్‌యాదవ్, తిరుపతి ఎంపీ గురుమూర్తి, మాజీ ఎంపీ బుట్టారేణుక, కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్ హాజరవుతారు.

ఏర్పాట్ల పరిశీలన: సామాజిక సాధికార బస్సు యాత్రకు సంబంధించిన ఏర్పాట్లను శుక్రవారం ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి, ఎమ్మెల్సీ తలశిల రఘురాం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి పోరెడ్డి నరసింహారెడ్డి, ఆర్‌పీసీఏ మెంబర్ కాకర్ల నాగేశ్వరెడ్డి, కౌన్సిలర్ వరికూటి ఓబుళరెడ్డి, మాజీ కౌన్సిలర్ శౌరి సుభాష్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బస్సు యాత్రకు పటిష్ట బందోబస్తు: ఎస్పీ సిద్దార్థ కౌశల్



పోలీసు అధికారులతో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ సిద్దార్థ్ కౌశల్

ప్రొద్దుటూరు క్రైం: ప్రొద్దుటూరులో శనివారం నిర్వహించనున్న సామాజిక సాధికార బస్సు యాత్రకు పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటుచేయాలని ఎస్పీ సిద్దార్థ్ కౌశల్ తెలిపారు. స్థానిక పుట్టపర్తి సర్కిల్‌లో జరిగే బహిరంగ సభ ప్రదేశాన్ని శుక్రవారం ఆయన పరిశీలించారు. అనంతరం త్రీ టౌన్ పోలీస్ స్టేషన్‌లో పోలీస్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. బస్సు యాత్ర జరిగే వైఎస్ఆర్ కల్యాణ మండపం, రామేశ్వరం, గాంధీ రోడ్డు, విజయ్‌కుమార్ సర్కిల్, రాజీవ్, ఉమేష్ చంద్ర, పుట్టపర్తి సర్కిళ్ల వరకు బందోబస్తు ఏర్పాటుచేయాలని ఎస్పీ ఆదేశించారు. సభ నిర్వహించే పుట్టపర్తి సర్కిల్ వద్ద భద్రతపై అధికారులకు సూచనలు చేశారు. ఈ సమావేశంలో ఏఆర్ అదనపు ఎస్పీ ఎస్ఎస్‌వీ.కృష్ణారావు, జమ్మలమడుగు డీఎస్పీ నాగరాజు, ఏఆర్ డీఎస్పీ రమణయ్య, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ వెంకటకుమార్, సీఐలు నారాయణయాదవ్, ఇబ్రహీం, రాజారెడ్డి, రమణారెడ్డి, ఎస్‌ఐలు, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ఓటర్లు @ 13,58,165

ప్రతి పౌరుడి ఓటు నవ భారతాన్ని నిర్మిస్తుంది. భారతదేశ పురోగతి మరియు అభివృద్ధి ఓటు ద్వారా ఎన్నుకున్న పాలకులే నిర్ణయిస్తారు. బాధ్యతాయుత పౌరులుగా ప్రతి ఒక్కరూ ఓటు వేయాలి. అధికారులు ముసాయిదా ఓటరు జాబితా విడుదల చేశారు. తమ ఓటు ఉందో లేదో తప్పక సరిచూసుకుని చేర్పులు మార్పులు చేసుకోవాల్సిన అవసరం ఉంది.

- ముసాయిదా జాబితా విడుదల చేసిన కలెక్టర్
- డిసెంబరు 9 వరకు చేర్పులు, అభ్యంతరాల స్వీకరణ



ముసాయిదా విడుదల చేస్తున్న జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్



రాయచోటి: ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు.. ఓటరు జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణ ప్రారంభమైందని కలెక్టర్ గిరీషా పీఎస్ పేర్కొన్నారు. ఓటు నమోదు, చేర్పులు, మార్పులు, అభ్యంతరాలు సమర్పించేందుకు ఎన్నికల కమిషన్ డిసెంబరు 9వతేదీ వరకు గడువు విధించిందని తెలిపారు. రాయచోటి కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఓటరు జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణ-2024లో భాగంగా అన్నమయ్య జిల్లాలో 13,58,165 మంది ఓటర్లతో ముసాయిదా జాబితా రూపొందించామని తెలిపారు. వీరిలో పురుషులు 6,68,575, మహిళలు 6,89,452, థర్డ్ జెండర్ 138 మంది ఉన్నారన్నారు. వివిధ పార్టీలు ఇచ్చిన ప్రతి ఫిర్యాదును తనిఖీచేసి పరిష్కరించినట్లు వెల్లడించారు. జంక్ క్యారెక్టర్, జీరో డోర్ నెంబర్ కలిగిన ఓట్లు పదివేల వరకు ఉన్నాయని, విడివిడిగా ఫామ్-8 తీసుకొని వాటిని సరిచేశామన్నారు. ఒకే డోర్ నెంబర్‌లో 10 కంటే ఎక్కువ ఓట్లు దాదాపు 35 వేలు వచ్చాయని, వాటిని పరిష్కరించామని పేర్కొన్నారు. వందేళ్లు పైబడిన 150 ఓట్లు ఉండగా, చనిపోయినవారిని, ఎక్కువ వయస్సు వేసిన వారిని తొలగించామని చెప్పారు. జాబితా జిల్లా వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల తహసీల్దారు కార్యాలయాల్లోనూ ప్రదర్శిస్తారని తెలిపారు. తమ ఓటు ఉందో లేదో సరిచూసుకుని ఏవైనా క్లెయిమ్‌లు, అభ్యంతరాలుంటే డిసెంబరు 9వ తేదీలోగా సమర్పించాల్సి ఉంటుందన్నారు. కొత్తగా ఓటు నమోదు చేసుకోవడానికి ఫారం-6, అభ్యంతరాలు, తొలగింపులకు ఫారం-7, ఓటరు వివరాల సవరణ, నియోజకవర్గ పరిధిలోని ఒక పోలింగ్ కేంద్రం నుంచి మరో పోలింగ్ కేంద్రానికి ఓటు బదిలీకి ఫారం-8 సమర్పించాలన్నారు. జిల్లాలో నవంబర్ 4, 5వ తేదీలు, డిసెంబర్ 2, 3వ తేదీలలో ఆయా పోలింగ్ స్టేషన్లలో క్యాంపెయిన్ నిర్వహిస్తామన్నారు. ప్రతి ఒక్కరూ బూత్ వారీగా తమ ఓటు తనిఖీ చేసుకోవాలని కలెక్టర్ వివరించారు. అనంతరం రాజకీయ పార్టీల ప్రతినిధులు అడిగిన సందేహాలకు సమాధానాలిచ్చారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఫర్మన్ అహ్మద్‌ఖాన్, డీఆర్‌ఓ సత్యనారాయణ, ఆర్డీఓలు రంగస్వామి, రామకృష్ణారెడ్డి, నియోజకవర్గ ఈఆర్‌ఓలు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా ఓటర్ల వివరాలు ఇలా..

నియోజకవర్గం	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం
రాజంపేట	1,11,406	1,16,802	19	2,28,227
కోడూరు(ఎస్సి)	96,903	99,503	17	1,96,423
రాయచోటి	1,21,082	1,23,705	27	2,44,814
తంబళ్లపల్లి	1,05,984	1,08,566	10	2,14,560
పీలేరు	1,10,391	1,13,620	12	2,24,023
మదనపల్లి	1,22,806	1,27,259	53	2,50,118
మొత్తం	6,68,575	6,89,452	138	13,58,165

'పీబీసీకి 200 క్యూసెక్కుల నీళ్లు'

బి.కొత్తకోట: హంద్రీనీవా పుంగనూరు ఉపకాలువ (పీబీసీ)కు విడుదల చేసిన కృష్ణా జలాల నీటి తరలింపు సామర్థ్యాన్ని రెండురోజుల్లో 200 క్యూసెక్కులకు పెంచుతున్నట్టు మదనపల్లె ఎస్ఈ సీఆర్ రాజగోపాల్ తెలిపారు. ప్రాజెక్టు డీఈఈ, ఏఈఈలతో కలిసి బి.కొత్తకోట మండలంలోని తరిగోడు ఎత్తిపోతల పథకం , బి.కొత్తకోట బీసీకాలనీ నుంచి జాతీయరహదారి వరకు కాలువపై ప్రవాహాన్ని ఆయన పరిశీలించారు. ఈనెల 9న సత్యసాయి జిల్లా చెర్లోపల్లె రిజర్వాయర్ నుంచి కృష్ణా జలాలను ఉమ్మడి చిత్తూరు జిల్లాకు చెందిన పుంగనూరు ఉపకాలువకు విడుదల చేయగా, ఈ ప్రవాహ వేగం మేరకు కుప్పం నియోజకవర్గానికి నీళ్లు ఎన్ని రోజులకు చేరుతాయనే విషయమై పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం పీబీసీకి 150 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారని, ఈ సామర్థ్యం సరిపోదని గుర్తించి 200 క్యూసెక్కుల నీటిని విడుదల చేయాలని ఉన్నతాధికారులను తెలిపారు. ప్రస్తుతం కృష్ణా జలాలు కురబలకోట మండలం అంగళ్లు సమీపానికి చేరినట్టు చెప్పారు. కాలువ ఎండుతున్నందున నీరు ఇంకిపోవడంవల్ల నీటి ప్రవాహ వేగం తగ్గిందని చెప్పారు. కుప్పం ఉపకాలువకు సంబంధించి రూ.55 కోట్ల మిగులు పనులు పూర్తిచేశామని చెప్పారు. పనులు పూర్తయ్యి, కృష్ణా జలాలు చేరాక సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా కుప్పంకు నీటిని విడుదల చేసే అవకాశముందని చెప్పారు. కాలువలో నీటి ప్రవాహానికి ఎలాంటి అడ్డంకులు లేవని చెప్పారు. డీఈఈలు త్రివేణి, శివారెడ్డి పాల్గొన్నారు.

క్లుప్తంగా

గాయపడిన యువకుడి మృతి


గజేంద్ర(ఫైల్)

నిమ్మనపల్లె : రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడు తిరుపతి రుయాలో చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందాడు. మండలంలోని ముష్టూరు పంచాయతీ గౌనివారిపల్లెకు చెందిన కె.వెంకటరమణ కుమారుడు కె.గజేంద్ర(22) ఈ నెల 25న ద్విచక్రవాహనంలో పక్కగ్రామమైన దిగువపల్లెకు వెళ్లి తిరిగి ఇంటికి వస్తుండగా, గ్రామ సమీపంలో వాహనం అదుపుతప్పి కల్వర్టును ఢీకొని తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన స్థానికులు అపస్మారకస్థితిలో ఉన్న గజేంద్రను 108 వాహనంలో మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యులు మెరుగైన వైద్యం కోసం తిరుపతికి రెఫర్ చేశారు. రుయాలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు నిమ్మనపల్లె పోలీసులు తెలిపారు.

టమాట పంటపై అడవి పందుల దాడి


చెల్లా చెదురు అయిన పంట

రామాపురం : మండలంలోని నల్లగుట్టపల్లె పంచాయతీ కర్ణపువాండ్లపల్లెకు చెందిన రైతు వంగిమళ్ల భాస్కర్‌రెడ్డి జాతీయ రహదారి పక్కన ఎకరా పొలంలో టమాట పంట సాగు చేశాడు. బాగా కోత కొచ్చే సమయంలో గురువారం రాత్రి అడవి పందులు పంటపై విచ్చలవిడిగా దాడి చేసి నాశనం చేశాయని రైతు వాపోయాడు. పంట పెట్టుబడి కోసం సుమారు రూ.50 వేలు ఖర్చు చేశానని తెలిపాడు. తనకు తీవ్ర నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం ఆదుకోవాలని ఆయన కోరాడు.

కానిస్టేబుల్ సస్పెన్షన్

గుర్రంకొండ : గుర్రంకొండ పోలీస్‌స్టేషన్ కానిస్టేబుల్ బి.విశ్వనాథ్‌ను జిల్లా ఎస్పీ కృష్ణారావు సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు ఎస్‌ఐ దిలీప్‌కుమార్ తెలిపారు. శుక్రవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆయన విలేకరులకు వివరాలు వెల్లడించారు. బి. విశ్వనాథ్ ఈ ఏడాది జూన్‌లో పెద్దమండ్యం పోలీస్‌స్టేషన్ నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారన్నారు. మండలంలోని కొన్ని గ్రామాల్లో జూదరులతో సన్నిహిత సంబంధాలతో పాటు జూదరలకు సహకరిస్తున్నాడనే ఆరోపణలు రావడం, అవి రుజువు కావడంతో సస్పెండ్ చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

మార్చురీలో గుర్తుతెలియని మృతదేహం



కడప అర్బన్ : కడప నగర శివార్లలోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (రిమ్స్) మార్చురీలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం వున్నట్లు ఆర్‌ఎంఓ డాక్టర్ శ్రీనివాసులు శుక్రవారం తెలియజేశారు. ఆచూకీ తెలిసిన బంధువులు ఎవరైనా వుంటే వారు తమను సంప్రదించాలనీ ఆయన కోరారు.

ఆనంద'సాగరం'లో అన్నదాత

- సర్వరాయసాగర్ ప్రాజెక్ట్ పెండింగ్ పనుల పూర్తికి చర్యలు
- హామీ నెరవేరుస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి
- పనులు ప్రారంభించిన ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి


సర్వరాయసాగర్ ప్రాజెక్టు (ఫైల్)

కడప సిటీ : త్వరలో సాగునీటి కల సాకారం కానుంది. సర్వరాయసాగర్ ప్రాజెక్టు పెండింగ్ పనులు పూర్తి అయితే.. అన్నదాతలకు ఆనంద సాగర్‌గా మిగిలిపోయే పరిస్థితి ఉంది. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో దాదాపు రూ.110 కోట్ల నిధులు కేటాయించి ప్రాజెక్టు పనులను వేగవంతం చేశారు. ఆయన మరణానంతరం సర్వరాయసాగర్ ప్రాజెక్టు పనులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లుగా నత్తనడకన సాగాయి. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన టీడీపీ ప్రభుత్వం ఈ ప్రాజెక్టు పనులకు పైసా కూడా విదిల్చకుండా అభివృద్ధిని గాలికొదిలేసింది. ప్రతిపక్ష నేతగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వీరపునాయునిపల్లె మండలంలో పాదయాత్ర చేస్తున్న సమయంలో.. అక్కడ ఉన్న వామికొండ, సర్వరాయసాగర్ ప్రాజెక్టులను తమ ప్రభుత్వం వచ్చాక పూర్తి చేసి రైతులకు సాగునీరు అందిస్తామని భరోసా ఇచ్చారు. ఈ నేపథ్యంలో ఇచ్చిన మాట మేరకు ఈ ప్రాజెక్టుల పెండింగ్ పనులకు దాదాపు రూ.210 కోట్లు కేటాయించి పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టారు. ఆ దిశగా పనులు జరుగుతున్నాయి. సర్వరాయసాగర్ ప్రాజెక్టు పెండింగ్ పనులను కమలాపురం ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి శుక్రవారం ప్రారంభించారు.

ప్రాజెక్టు సామర్థ్యం ఇలా

సర్వరాయసాగర్ ప్రాజెక్టు గాలేరు–నగరి సుజల స్రవంతి పథకంలో భాగంగా 32వ కిలోమీటరు వద్ద వీరపునాయునిపల్లె మండలం ఇందుకూరు గ్రామ పరిసరాల్లో ఉంది. ఈ ప్రాజెక్టు నీటి సామర్థ్యం 3.06 టీఎంసీలుగా ఉంది. 25 వేల ఎకరాల ఆయకట్టుకు నీరు అందించాలనే లక్ష్యంతో ఈ ప్రాజెక్టు నిర్మాణం చేపట్టడం జరిగింది.

వైఎస్సార్ హయాంలో రూ.110 కోట్లు

దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి జలయజ్ఞం పేరిట ప్రతి ఎకరాకు సాగునీరు ఇవ్వాలన్న సంకల్పంతో ప్రాజెక్టుల నిర్మాణ పనులపై ప్రత్యేక శ్రద్ధ వహించి పనులను వేగవంతం చేసి పూర్తి చేసేందుకు చర్యలు తీసుకున్నారు. అందులో భాగంగానే సర్వరాయసాగర్ ప్రాజెక్టుకు ఆయన హయాంలో రూ.110 కోట్ల నిధులు కేటాయించి ప్రాజెక్టును రూపురేఖలకు తెచ్చారు. ఈ మొత్తంతో బండ్ పనులు పూర్తి చేయడంతోపాటు రివిట్‌మెంట్, స్లూయిజ్ గేట్లు తదితర పనులు పూర్తయ్యాయి.

పైసా విదిల్చని టీడీపీ సర్కారు

వైఎస్సార్ మరణం తర్వాత జిల్లాలో ప్రాజెక్టు పనులు అటకెక్కాయి. ఆ తర్వాత వచ్చిన ముఖ్యమంత్రులు శ్రద్ధ తీసుకోకపోవడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. 2014 నుంచి 2019 వరకు అధికారంలో ఉన్న తెలుగుదేశం పార్టీ ప్రాజెక్టు పనులకు పైసా కూడా విదల్చకుండా పోవడంతో ప్రాజెక్టు నిర్మాణంపై రైతుల్లో ఆశలు సన్నగిల్లాయి.

వైఎస్ జగన్ హయాంలో రూ.80 కోట్ల నిధులు

తన ప్రజా సంకల్పపాదయాత్రలో ఇచ్చిన హామీకి కట్టుబడి ఈ ప్రాజెక్టు పనులకు దాదాపు రూ.80 కోట్ల నిధులను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కేటాయించారు. ఈ నేపథ్యంలో పెండింగ్ పనులను పూర్తి చేయనున్నారు. ఈ పనులను కమలాపురం ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి ప్రారంభించారు. రివిట్‌మెంట్‌కు సంబంధించి మిగిలిన పనులు, అప్రోచ్ ఛానల్స్ తదితరాలను చేపట్టనున్నారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన పెండింగ్ పనులన్నీ పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టారు.

ఊట భూముల రక్షణకు చర్యలు

ఎన్నో ఏళ్ల తరబడి ఉన్న సమస్యను ఈ ప్రభుత్వం వచ్చాక పరిష్కరించేందుకు చర్యలు చేపట్టింది. సర్వరాయసాగర్ ప్రాజెక్టుకు సంబంధించి ఇందుకూరు గ్రామ పరిసరాల్లో ఉన్న 110 ఎకరాల భూముల్లో ఊటల మయమై వ్యవసాయానికి పనికిరాకుండా పోయింది. దీంతో ఆ రైతులకు పంటలు పండించుకునేందుకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడ్డాయి. ఈ పరిస్థితిని అధిగమించేందుకు సిమెంటు గ్రౌటింగ్ పనులను చేపట్టి ఆ భూములకు రక్షణ కల్పించనున్నారు. దీంతో సంబంధిత రైతుల్లో హర్షం వ్యక్తమవుతోంది. ఈ పనులకుగాను రూ.13 కోట్ల నిధులను వెచ్చించనున్నారు. త్వరలో ఈ పనులు చేపట్టేందుకు అధికారులు చర్యలు చేపట్టారు.

25 వేల ఎకరాల ఆయకట్టుకు నీళ్లిచ్చే అవకాశం

ఈ ప్రాజెక్టు పెండింగ్ పనులు పూర్తయితే ఎర్రగుంట్ల, వీఎన్ పల్లె, కమలాపురం మండలాలకు చెందిన రైతులకు సంబంధించి 25 వేల ఎకరాల ఆయకట్టుకు నీళ్లిచ్చి సస్యశ్యామలం చేసేందుకు అవకాశం ఏర్పడుతుంది. అంతేకాకుండా 80 వేల మంది ప్రజల తాగునీటి అవసరాలు కూడా తీరనున్నాయి. ఎడమకాలువ ఆయకట్టు 9 వేల ఎకరాలు, కుడి కాలువ ఆయకట్టు 16 వేల ఎకరాలు ఉంది. ఇందుకు సంబంధించిన పనులు కూడా త్వరలో ప్రారంభించేందుకు అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు.

ఎంపీ, ఎమ్మెల్యేల ప్రత్యేక కృషి

సర్వరాయసాగర్ ప్రాజెక్టు పెండింగ్ పనులు పూర్తి చే సేందుకు కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, కమలా పురం ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డిలు ప్రత్యేక చర్యలు చేపట్టారు. అందులో భాగంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి ఈ పనుల విషయంపై పలుమార్లు తీసుకెళ్లి నిధుల మంజూరుకు కృషి చేశారు.

ముమ్మరంగా పనులు



సర్వరాయసాగర్ ప్రాజెక్టు పెండింగ్ పనులు త్వరలో పూర్తి చేసి ఆయకట్టుకు నీళ్లిచ్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేశాం. కలెక్టర్ విజయరామరాజు పెండింగ్ ప్రాజెక్టు పనులపై ప్రత్యేక శ్రద్ధ వహించి పనులు వేగవంతం చేసేందుకు అన్ని చర్యలు చేపడుతున్నారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన పెండింగ్, కాలువ పనులు వేగవంతంగా చేపడుతాం.

– మల్లికార్జునరెడ్డి, ఎస్‌ఈ, జీఎన్ఎస్ఎస్, కడప

వైఎస్సార్ ఆశయ సాధన కోసం కృషి


సర్వరాయసాగర్ ప్రాజెక్టు పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి

వీరపునాయునిపల్లె : దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ఆశయాల సాధన కోసం కృషి చేస్తున్నామని కమలాపురం ఎమ్మెల్యే పోచంరెడ్డి రవీంద్రనాథ్‌రెడ్డి అన్నారు. సర్వరాయ సాగర్ ప్రాజెక్టుకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న రూ.212 కోట్ల పనులను ఆయన శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నందమూరి తారక రామారావు రాయలసీమ ప్రాంతానికి కృష్ణా జలాలను తీసుకువచ్చేందుకు శ్రీకారం చుట్టారని, తదుపరి అధికారంలోకి వచ్చిన తెలుగుదేశం నాయకులు గాలికి వదిలేశారని తెలియజేశారు. వైఎస్ రాజశేఖరరెడ్డి రాయలసీమ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేయాలన్న సంకల్పంతో గాలేరు- నగరి సుజల స్రవంతి పథకం రూపకల్పనకు మళ్లీ శ్రీకారం చుట్టారని తెలిపారు. ఆనాడు ఆయన చేసిన కృషి వలనే నేడు కృష్ణా జలాలు వస్తున్నాయని అన్నారు. ఆయన మరణానంతరం అధికారంలోకి వచ్చిన చంద్రబాబు గాలికి వదిలేయడం జరిగిందన్నారు. వైఎస్ రాజశేఖరరెడ్డి ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలన్న సంకల్పంతో ఆయన కుమారుడు, ప్రస్తుత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రాజెక్టులకు సంబంధించి పనులను పరుగులు పెట్టిస్తున్నారని పేర్కొన్నారు. వీరపునాయునిపల్లె మండలంలో ఎన్నికల నాటికి 35 వేల ఎకరాలకు నీటిని అందించేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. మండలంలోని చెరువులు, కుంటలకు వాగుల ద్వారా నీటిని విడుదల చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. కావున ఆక్రమణకు గురైన వాగులను సర్వే చేపట్టాలని రెవెన్యూ అధికారులకు సూచించారు. మొయిళ్లచెరువు, యన్ పాలగిరి, బుసిరెడ్డిపల్లె, ఓబుల్‌రెడ్డిపల్లె తదితర గ్రామాలు ప్రాజెక్టుకు ఎగువ ప్రాంతంలో ఉండటం వల్ల పంట కాలువలు ఏర్పాటు చేసేందుకు అవకాశం లేకపోవడంతో.. ఆయా గ్రామాలకు నీరు అందించేందుకు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రాజెక్టుకు రివిట్‌మెంటు, లీకేజీ పనులు త్వరగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. ఈ కార్యక్రమంలో సీఈ హరినారాయణరెడ్డి, ఎస్‌ఈ మల్లికార్జునరెడ్డి, మండల అధ్యక్షుడు రఘునాథరెడ్డి, స్థానిక నాయకులు గోపాల్‌రెడ్డి, వెంకటేష్, విశ్వనాథరెడ్డి, సురేష్‌రెడ్డి, సాంబశివారెడ్డి, వెంకటరామిరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

నా కొడుకు కుటుంబంతో ప్రాణహాని

- కోడలు, మనవడు దాడి
- ఓ వృద్ధురాలి ఆవేదన


మాట్లాడుతున్న మారమ్మ

రాజంపేట రూరల్ : తన చిన్న కొడుకు దేశి సూర్యభగవాన్‌రెడ్డి కుటుంబంతో తనకు ప్రాణహాని ఉందని 80 ఏళ్ల వృద్ధురాలు దేశి మారమ్మ వాపోయారు. స్థానిక ఏరియా ఆసుపత్రిలో శుక్రవారం ఆమె విలేకరలతో తన వ్యథను పంచుకున్నారు. తమది పుల్లంపేట మండలం రెడ్డిపల్లి గ్రామమని తెలియజేశారు. తనకు ముగ్గురు కుమారులు ఉన్నారన్నారు. తాను గత సంవత్సరంలో కొన్ని రోజులు తన చిన్న కొడుకు వద్ద ఉన్నానని తెలియజేసింది. ఆ సమయంలో తనను ప్రతి రోజు తన చిన్నకుమారుడు, కోడలు వేధించే వారని తెలియజేశారు. గత సంవత్సరంలో తన పేర ఉన్న 2 ఎకరాల 75 సెంట్ల భూమిని బలవంతంగా రాయించుకున్నారని తెలియజేసింది. తన దగ్గర ఉన్న 75 గ్రాముల బంగారంను తనను కొట్టి బలవంతంగా లాక్కున్నారని వాపోయింది. ఇంటి స్థలం 3 సెంట్లు కూడా ఆక్రమించుకున్నారని పేర్కొంది. తాను బుధవారం గంగమ్మతల్లి గుడి వద్ద పూజలు చేస్తుండగా.. చిన్న కోడలు లక్ష్మీదేవి, మనవడు భరత్‌రెడ్డి కొట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. తన ఆస్తిని లాక్కునేందుకు చంపడానికి ప్రయత్నిస్తున్నారని తెలియజేసింది. అనంతరం ఆమె రెండవ కుమారుడు శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ మా అమ్మపై ఇప్పటికే తన చిన్నతమ్ముడు కుటుంబీకులు పలు మార్లు దాడి చేశారని తెలియజేశారు. గాయపడిన తన తల్లిని ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించినట్లు తెలియజేశారు. పుల్లంపేట పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. పోలీసులు ఈ దాడిపై న్యాయ విచారణ చేసి తన తల్లికి న్యాయం చేయాలని కోరారు.

భార్య కోసం భర్త ఆత్మహత్య

రాజంపేట రూరల్ : భార్య కాపురానికి రాలేదని భర్త ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల పరిధిలోని ఎంజీ పురం పంచాయతీ సిద్దేశ్వరకాలనీలో శుక్రవారం చోటు చేసుకుంది. రూరల్ ఎస్‌ఐ ఎం.భక్తవత్సలం తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ఇల్లా శివయ్య(29) కుటుంబ కలహాలతో మనస్తాపం చెంది ఉరేసుకుని చనిపోయినట్లు తెలియజేశారు. తన భార్య కాపురానికి రాలేదని మనోవేదనతో శివయ్య శుక్రవారం సాయంత్రం తన ఇంటిలో ఉరేసుకున్నాడు. విషయం కనుక్కున్న చుట్టుపక్కల ప్రజలు అతన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే మరణించినట్లు వైద్యులు తెలియజేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలియజేశారు.

బైక్ ఢీకొని వృద్ధుడి మృతి


మృతి చెందిన వెంకటరమణ

పీలేరు రూరల్ : బైక్ ఢీకొని ఓ వృద్ధుడు మృతి చెందగా, ఆర్టీసీ డ్రైవర్ తీవ్రంగా గాయపడ్డ సంఘటన మండలంలోని రాయలవారిపల్లె వద్ద చోటు చేసుకుంది. వివరాలిలా వున్నాయి. కలకడ మండలం నడిమిచెర్ల పంచాయతీ అగ్రహారానికి చెందిన ఆర్టీసీ డ్రైవర్ సి.ఎస్.ఆర్.మూర్తి విధుల నిమిత్తం ద్విచక్రవాహనంలో పీలేరుకు బయలుదేరాడు. ఇదే సమయంలో రాయలవారిపల్లెకు చెందిన టి.వెంకటరమణ (65) గ్రామం వద్ద రోడ్డుపై నడిచి వెళ్తుండగా ద్విచక్రవాహనం వెనుకవైపు నుంచి ఢీకొంది. ఈ ప్రమాదంలో వెంకటరమణతోపాటు బైక్‌పై వస్తున్న సి.ఎస్.ఆర్. మూర్తి తీవ్రంగా గాయపడ్డారు. ఇద్దరిని చికిత్స నిమిత్తం 108 వాహనంలో పీలేరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అయితే వెంకటరమణ చికిత్స పొందుతూ మృతి చెందాడు. సి.ఎస్.ఆర్. మూర్తిని మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ నరసింహుడు తెలిపారు.

రోడ్డు ప్రమాదాల్లో నలుగురికి గాయాలు

మదనపల్లె : వేర్వేరు ప్రాంతాల్లో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదాల్లో నలుగురు వ్యక్తులు గాయపడ్డారు. బి.కొత్తకోట మండలం కంబాలపల్లెకు చెందిన ఆర్.రామక్క(60) ద్విచక్రవాహనంలో వెనుకవైపు కూర్చుని ప్రయాణిస్తూ చేతిలోని భోజనం క్యారియర్ పడిపోతుండటంతో పట్టుకునే క్రమంలో అదుపుతప్పి వాహనంపై నుంచి కిందపడింది. ఈ ప్రమాదంలో ఆమె తీవ్రంగా గాయపడగా, స్థానికులు 108 అంబులెన్స్ వాహనంలో జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అదే విధంగా కురబలకోట మండలం కనికలవారిపల్లెకు చెందిన రెడ్డిశేఖర్(29) తన కొడుకు రాజేష్(7)తో కలిసి మదనపల్లెకు ద్విచక్రవాహనంలో వస్తుండగా, మార్గంమధ్యలో మరో ద్విచక్రవాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో తండ్రీకొడుకులు గాయపడ్డారు. గమనించిన స్థానికులు వారిని మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. సంబంధిత పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆగిన ట్రాక్టర్‌ను ఢీకొన్న బైక్

సిద్దవటం : సిద్దవటం గ్రామ శివారులోని పెన్నానది హైలెవల్ వంతెన వద్ద నిలిచి ఉన్న ట్రాక్టర్‌ను బైక్‌లో వెళ్తున్న సంద్రపల్లి వెంకటరమణ ఢీకొని తీవ్రంగా గాయపడ్డాడు. సిద్దవటం దిగువపేటకు చెందిన ఆయన బైక్‌లో శుక్రవారం రాత్రి కడపకు బయలుదేరాడు. పెన్నానది హైలెవల్ వంతెనపై ట్రాక్టర్‌ను ఆపి డ్రైవర్ డీజిల్ తీసుకొచ్చుకొని ఇంజన్‌లో పోసి కదిలించేటప్పటికే వెంకటరమణ వెనుకవైపు ఢీకొన్నాడు. దీంతో ఆయనకు తీవ్ర గాయాలయ్యాయి. వైద్యం కోసం 108 వాహనంలో కడప రిమ్స్‌కు తరలించి, విచారణ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సమస్య రహిత సమాజమే జగనన్న లక్ష్యం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు

చిట్వేలి : రాష్ట్రంలో సమస్య రహిత సమాజం కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ×జగనన్నకు చెబుదాం॰ కార్యక్రమాన్ని అమలు పరుస్తున్నారని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు పేర్కొన్నారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్‌లు ముఖ్య అతిథులుగా పాల్గొని కార్యక్రమం విశిష్టతను వివరించారు. మండల నలుమూలల నుంచి వందలాది మంది ప్రజలు పాల్గొని సమస్యలను కలెక్టర్‌కు విన్నవించారు. అర్జీలను పరిశీలించిన కలెక్టర్ ఆయా శాఖల అధికారుల సమక్షంలో పరిష్కారానికి ఆదేశాలిచ్చారు. ఈ కార్యక్రమంలో స్కిల్ డెవలప్‌మెంట్ చైర్మన్ కొండూరు అజయ్‌రెడ్డి, జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ పంజం సుకుమార్‌రెడ్డి, మండల కన్వీనర్ చెవ్వు శ్రీనివాసులురెడ్డి, ఎల్‌వీ మోహన్‌రెడ్డి, సర్పంచ్ ఉమా మహేశ్వరరెడ్డి, వెంకటరమణ, లింగం లక్ష్మీకర్, ఎంపీపీ, ఉపాధ్యక్షులు సుబ్రమణ్యంరెడ్డి, కనకరాజ, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, ఆర్డీఓ రామకృష్ణారెడ్డి, ఎంపీడీఓ శివరామిరెడ్డి, తహసీల్దార్ శిరీషా, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

వేర్వేరు ప్రాంతాల్లో ఐదుగురి ఆత్మహత్యాయత్నం

మదనపల్లె : వేర్వేరు ప్రాంతాల్లో ఐదుగురు ఆత్మహత్యాయత్నాలకు పాల్పడి స్థానిక ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. తంబళ్లపల్లె మండలం ఎగువసుగాలి తండాకు చెందిన నాగునాయక్ భార్య చిట్టెమ్మ(45) కుటుంబ సమస్యలతో గురువారం రాత్రి నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యకు ప్రయత్నించింది. అదేవిధంగా ములకలచెరువు మండలం ఎద్దులవారిపల్లె పంచాయతీ వేపులకోటకు చెందిన భాస్కర్ భార్య సుమతి(24) కుటుంబ సమస్యలతో క్రిమి సంహారణ మందు తాగి ఆత్మహత్యకు యత్నించింది. మదనపల్లె పట్టణం ఎస్టేట్‌కు చెందిన ప్రభుదేవ్ కుమారుడు ఎన్.మహేష్(23) ఎలుకల నివారణ మందు తిని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కురబలకోట మండలం నందిరెడ్డిగారిపల్లె పంచాయతీ తుంగావారిపల్లెకు చెందిన చిన్నరెడ్డి కుమార్తె సి.గాయత్రి(20) ఇంజనీరింగ్ మొదటి సంవత్సరం చదువుతోంది. ఇంట్లో తల్లిదండ్రులు మందలించడంతో మనస్తాపం చెంది క్రిమి సంహారణ మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించింది. ముదివేడు పంచాయతీకి చెందిన పెద్దచిన్నప్ప కుమారుడు పి.రామచంద్ర(55) పురుగుల నివారణ మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. వారిని సంబంధీకులు స్థానిక ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో చేర్పించారు.

నిత్య జీవితంలో ఎంబెడెడ్ సిస్టమ్స్ పాత్ర కీలకం


మాట్లాడుతున్న స్విట్జర్లాండ్ ప్రొఫెసర్ సెడ్రిక్ బోర్నాండ్

కురబలకోట : మనిషి దైనందిన జీవితంలో ఎంబెడెడ్ సిస్టమ్స్ పాత్ర కీలకంగా మారిందని స్విట్జర్లాండ్ హెచ్‌ఈఐజీవీడీ ఇన్‌స్టిట్యూట్ ఎంబెడెడ్ డిజిటల్ సిస్టమ్స్ ప్రొఫెసర్ సెడ్రిక్ బోర్నాండ్ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన మదనపల్లె దగ్గరున్న మిట్స్ ఇంజినీరింగ్ కళాశాలను సందర్శించారు. అధ్యాపకులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రస్తుత ఆధునిక జీవితంలో ప్రతి రంగంలో ఎంబెడెడ్ సిస్టమ్స్ పాత్ర గణనీయంగా పెరుగుతోందన్నారు. గృహోపకరణాలు, స్మార్ట్‌ఫోన్లు, ఏటీఎం, జీపీఎస్, ఫిట్‌నెస్ ట్రాకర్లు, టీవీ, థర్మోస్టాట్లు, వైద్య పరికరాలు, కెమెరాలు తదితర మైనవి ఎంబెడెడ్ టెక్నాలజీ ద్వారానే నడుస్తున్నాయన్నారు. ఆశాజనక ప్యాకేజీతో ఉద్యోగావకాశాలు కూడా మెరుగ్గా వున్నాయన్నారు. దీనిపై అనేక పరిశోధనలు జరుగుతున్నాయన్నారు. హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్ కాంబినేషన్‌లో ఎలక్ట్రానిక్ సిస్టమ్‌ను డిజైన్ చేయడమే ఎంబెడెడ్ సిస్టమన్నారు. ప్రపంచం మరింత డిజిటల్‌గా కనెక్ట్ చేయబడి ఆటోమేటెడ్‌గా మారుతోందన్నారు. ఎంబెడెడ్ టెక్నాలజీ ద్వారానే ఇది సాధ్యపడుతుందన్నారు. భవిష్యత్తులో ఈ రంగానికి ఎనలేని ప్రాధాన్యత ఉంటుందన్నారు. విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు.



ఎస్‌జీఎఫ్ జిల్లా నెట్‌బాల్ జట్ల ఎంపిక

కడప స్పోర్ట్స్/చెన్నూరు : ఎస్‌జీఎఫ్ జిల్లా స్థాయి నెట్‌బాల్ ఎంపికలు చెన్నూరు మండలం రామనపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో నిర్వహించారు. శుక్రవారం నిర్వహించిన ఈ ఎంపికలను ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి బి. అరుణకుమారి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లా జట్టుకు ఎంపికయ్యే క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీల్లో చక్కటి ప్రతిభ కనబరచాలని సూచించారు. అనంతరం అండర్–14, అండర్–17 బాలబాలికల విభాగాల్లో ఎంపికలు నిర్వహించి జిల్లా జట్లను ప్రకటించారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జిల్లా జట్లకు ఎంపికైన క్రీడాకారులు

అండర్–14 బాలికలు : చర్మిత, వెంకటశృతి, హసీనా, మోక్షిత, పావని, విష్ణుప్రియ, సంకీర్తన, జాస్మిన్, లావణ్య, సుదీప, కీర్తిక, రామతులసమ్మ

అండర్–17 బాలురు : సాత్విక, దివ్య, వెన్నెల, అపరంజి, స్నేహలత, కీర్తన, భారతి, ద్రాక్షాయణి, దివ్య, నందిని, సిరివెన్నెల, అరుణ

అండర్–14 బాలురు : దుర్గాప్రసాద్, హర్షవర్ధన్, హుస్సేన్‌బాషా, తిరుమలగిరి, మహమూద్, లోకేష్, శివశంకర్, వేదప్రకాష్, దిలీప్, జశ్వంత్, తేజేష్‌కుమార్, మహమ్మద్ రఫీ

ఉత్సాహంగా రోలర్ స్కేటింగ్ ఎంపికలు

కడప స్పోర్ట్స్ : కడప నగరం డీఎస్‌ఏ క్రీడా మైదానం ఆవరణలోని స్కేటింగ్ రింక్‌లో శుక్రవారం నిర్వహించిన ఎస్‌జీఎఫ్ జిల్లా స్థాయి రోలర్ స్కేటింగ్ ఎంపికలు ఉత్సాహంగా సాగాయి. ఈ ఎంపికలను ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి బి.అరుణకుమారి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ ఎంపికల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచే క్రీడాకారులను రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనే జిల్లా జట్టుకు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. అనంతరం అండర్–14, అండర్–17 బాలబాలికల విభాగాల్లో ఎంపికలు నిర్వహించి జిల్లా జట్లను ప్రకటించారు. కార్యక్రమంలో స్కేటింగ్ అసోసియేషన్ కార్యదర్శి ఇజ్రాయిల్, వ్యాయామ ఉపాధ్యాయులు నిత్యప్రభాకర్, వెంకటలక్ష్మి, శిక్షకుడు విలియం కేరీ, క్రీడాకారులు పాల్గొన్నారు.

జిల్లా జట్లకు ఎంపికైన క్రీడాకారులు

అండర్–11 ఇన్‌లైన్ : జోషికృపాకర్, పార్థిపన్‌రెడ్డి, వేదీశ్వర్‌రెడ్డి, ప్రణీత్, ఆర్.కె.జెస్సికా ఏంజిల్, జెరుషా, సన, జశ్వంత్‌రెడ్డి

అండర్–11 క్వాడ్ : రేవంత్, పునీత్, నాగపునీత్, విక్రాంత్, హార్దిక్, కె.ఉపాసన, సదాఅలీ, అఫ్రీన్, గమన్విత, యశస్వి.

వ్యాసరచన పోటీలకు విశేష స్పందన


వ్యాసరచన పోటీలలో పాల్గొన్న విద్యార్థులు, పోలీసులు

రాయచోటి : పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలలో భాగంగా పోలీసులు నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ పోటీలకు విశేష స్పందన లభించింది. శుక్రవారం జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు ఆదేశాల మేరకు అన్నమయ్య జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్నీ పోలీస్ స్టేషన్ల పరిధిలో ఈ పోటీలను నిర్వహించారు. వ్యాసరచన పోటీలు, వక్తృత్వ (ఉపన్యాసం) పోటీలలో పోలీసులు వారి పిల్లలతో, విద్యార్థులు పాల్గొన్నారు. రోల్ ఆఫ్ టెక్నాలజీ ఇన్ ప్రివెన్షన్ ఆఫ్ సోషల్ మీడియా అబ్యూస్, సైబర్ ఫ్రాడ్స్ అనే అంశాలపై పోటీలను నిర్వహించారు. పోటీలలో ప్రథమ బహుమతి పొందిన వారికి రూ.5 వేలు, ద్వితీయ బహుమతి పొందిన వారికి రూ.3 వేలు, తృతీయ బహుమతి పొందిన వారికి రూ.2 వేలు వంతును బహుమతి ప్రదానం చేస్తారని జిల్లా అదనపు ఎస్పీ వీబీ రాజకుమల్ తెలిపారు. ఎంతో ఉత్సాహంగా విద్యార్థిని, విద్యార్థులు పోలీస్ కుటుంబాల పిల్లలు, పోలీస్ ఉద్యోగులు పాల్గొనడం హర్షదాయకమని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని ప్రభుత్వ ఉపాధ్యాయులు పర్యవేక్షణ చేశారు. కార్యక్రమంలో ఏఆర్‌డీఎస్పీ పి.మహబూబ్ బాష, ఆర్‌ఐలు, ఆర్‌ఎస్‌ఐలు ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.